
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024



నేడు క్రిస్మస్ హైటీ వేడుకలు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని సోమవారం కోడిరామ్మూర్తి స్టేడియం పక్కన ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళావేదికలో ఉదయం 10గంటలకు హైటీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి క్రిస్టియన్ పెద్దలు, జిల్లాలో వివిధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

రెవెన్యూలో ఫోర్జరీ!

- వెలుగుచూస్తున్న లీలలు
- ప్రాంతీయ సదస్సులో భారీగా ఫిర్యాదులు
- గత ఐదేళ్లలో అవినీతి అక్రమాలెన్నో?



రణస్థలంలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు (ఫైల్)

- పలాస తహసీల్దారు సంతకం ఫోర్జరీ విషయం ఈ నెల 19న వెలుగులోకి వచ్చింది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఓ ఇంటి స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జారీ చేసిన పొజిషన్ సర్టిఫికెట్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తహసీల్దారు కళ్యాణచక్రవర్తిని సంప్రదించారు. అటువంటి సర్టిఫికెట్ తాను జారీచేయలేదని చెప్పడంతో ఫోర్జరీగా తేలింది. దీనిపై పోలీసులతో పాటు ఉన్నతాధికారులకు తహసీల్దారు గురువారం ఫిర్యాదు చేశారు.

- ఈ ఏడాది జనవరి 27న రణస్థలం మండలం జీరుపాలేం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఖాళీ స్థలంగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించాడు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఆ స్థలంలో ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వానికి అపరాధ రుసుం కింద రూ.50వేలు చెల్లించాలని నిర్మాణదారుడ్ని ఆదేశించారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు జిల్లాలో చాలా ఉన్నాయి.

- సిక్కోలుకు సరిహద్దు ప్రాంతంలో ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలు ఉన్నాయి. ఏపీలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతరత్రా విద్యకు సంబంధించి పథకాలకు స్థానికత సర్టిఫికెట్ ఉండాలి. అయితే ఒడిశాకు చెందిన చాలామంది విద్యార్థులకు స్థానికత సర్టిఫికెట్లు అందించి కొంతమంది అధికారులు, తహసీల్దార్లు సొమ్ము చేసుకుంటున్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు దీనికి సూత్రధారులుగా మారుతున్నారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

- విశాఖలో ఇటీవల రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్.. ప్రాంతీయ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉత్తరాంధ్ర నుంచి భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి భారీగా భూ సమస్యలపైనే ఫిర్యాదులు వెళ్లాయి. గత ఐదేళ్లుగా వైసీపీ నేతల సిఫారసులకు తలొగ్గి ప్రభుత్వ, ప్రైవేటు భూములను అక్రమార్కులకు అధికారులు రాసిచ్చారని తేలింది.

రణస్థలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖలో అవినీతికి అంతే లేకుండా పోతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కో అక్రమం వెలుగులోకి వస్తోంది. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు అనేది పెద్ద స్కామ్‌గా తేలింది. ఉమ్మడి జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో చాలావరకూ ఫోర్జరీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. 20ఏళ్ల కిందట డీ-పట్టాలు పొందితే.. ఆ స్థలాలు అమ్ముకోవచ్చని గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక జీవో తెచ్చింది. కానీ ఈ జీవో వెనుక పెద్ద అవినీతి ఉందనే ఆరోపణలున్నాయి. జీవో వస్తుందని ముందస్తుగా తెలుసుకున్న వైసీపీ నేతలు ఎక్కడికక్కడే డీ-పట్టా భూముల లబ్ధిదారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకున్నారు. తక్కువ ధరకు ఆ భూమిని కొనుగోలు చేశారు. అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీటిపైనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లోనూ వీటిపైనే ఎక్కువగా వినతులు వస్తున్నాయి. ఇటీవల విశాఖలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్వహించిన ప్రాంతీయ రెవెన్యూ సదస్సులోనూ ఈ విషయంపైనే ఎక్కువ మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. దీంతోపాటు 'జగనన్న భూ సురక్ష' పేరుతో భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు మరింత ఎక్కువయ్యాయి. భూమి తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా.. ఎక్కువగా ఉన్నవారికి తక్కువ భూమి ఉండేలా సర్వే చేశారు. అప్పటి అధికార పార్టీకి అనుకూలంగా ఈ సర్వే చేసినట్లు ఆరోపణలున్నాయి. దీని వెనుక కొంత మంది అస్మదీయ అధికారులు, సిబ్బంది హస్తం ఉందన్నది బహిరంగ రహస్యం. మరోవైపు పెద్ద ఎత్తున డీపట్టా భూములు చేతులు మారిన విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే అటువంటి భూముల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది.



భూ సమస్యలను రెవెన్యూ మంత్రికి తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

● గ్రామకంఠం భూములు స్వాహా..

చాలా గ్రామాల్లో గ్రామకంఠం భూములకు సంబంధించి సాగుదారులు లేరు. అటువంటి భూములపై పక్కనే ఉండే జిరాయితీ, డీ-పట్టా భూముల హక్కుదారుల కన్నుపడుతోంది. తమ భూమి సర్వే నంబరుతో గ్రామకంఠం భూమిని కలుపుకొని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇటువంటి భూములకు వీఆర్వో ధ్రువీకరణ ఇస్తే సరిపోతుంది. వీఆర్వో ఒప్పుకుంటే సరి.. లేదంటే మాత్రం వీఆర్వో సంతకాలు, స్టాంప్‌ను ఫోర్జరీవి తయారుచేసి ధ్రువపత్రాలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటితోనే సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తమ పేరిట రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూములు ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అయినా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉంది. స్థానికంగా ఉండే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అయితే తెలిసిపోతుందని.. సుదూర ప్రాంతంలో తమకు అనుకూలమైన కార్యాలయాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ప్రాంతానికి చెందిన పలువురు టెక్కలి, పలాస, నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడైనా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కఠినంగా ఉన్నచోట వ్యవహారం సాగడం లేదు. వీటిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తే అక్రమ రిజిస్ట్రేషన్‌లు బయటపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● ఒకే సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్లు..

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. సోంపేట, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, పొందూరు, రణస్థలం వంటి పట్టణాల్లో భూ అవతవకలు అన్నీఇన్నీ కావు. ఒకే పట్టాతో రిజిస్ట్రేషన్లు, ఫేక్ సర్టిఫికెట్లు.. ఇలా ఎన్నో దందాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒకే సర్వే నంబర్‌లో ఉన్న ఒకే స్థలాన్ని వేర్వేరు వ్యక్తులకు అమ్ముతున్నారు. ప్రధానంగా వ్యాపారాల్లో నష్టపోయి ఐపీ పెట్టేసిన వారి భూములను దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఆ భూమినే వేర్వేరు వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చివరికి వివాదాస్పదమవుతుండడంతో కొనుగోలుదారులు.. వారి ఒప్పందాలకు ఒప్పుకోవాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంది.

ప్రత్యేక దృష్టి..

జిల్లాలో భూ ఆక్రమణలు, ఫోర్జరీ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎక్కడైనా ఇటువంటి సమస్యలుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి. భూములు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించుకోవడం శ్రేయస్కరం. అధికారులు, సిబ్బంది సంతకాల ఫోర్జరీ అనేది తీవ్ర నేరం. ఇందులో సొంత శాఖ సిబ్బంది ఉన్నా చర్యలు తప్పవు.

-కె.సాయిప్రత్యూష, ఆర్డీవో, శ్రీకాకుళం

అనుమానం వస్తే నిలుపుదల..

ఏ మాత్రం అనుమానం ఉన్నా సంబంధిత భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నాం. ముఖ్యంగా ధ్రువపత్రాలు, భారీ విలువ చేసే భూముల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఏమాత్రం అనుమానం వచ్చినా రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నాం. కొంతమంది పలాస, టెక్కలి, నరసన్నపేట రిజిస్ట్రర్ కార్యాలయాల్లో ఈ ప్రాంతానికి చెందిన భూములు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. భూముల కొనుగోలుదారులు సైతం ఒకటికి రెండుసార్లు ఆ భూముల వివరాలను చూసుకోవాలి.

- వి.తులసీదాసు, సబ్‌రిజిస్ట్రార్, రణస్థలం

విద్యావ్యవస్థ పూర్వ వైభవానికి కృషి

● జనవరి ఒకటి నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం: మంత్రి అచ్చెన్న



కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భ్రష్టు పట్టించిన విద్యావ్యవస్థ పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక కస్తూర్బా విద్యాలయం, కళాశాల ప్రాంగణంలో రూ.1.10 కోట్లతో నిర్మించిన నూతన అదనపు కళాశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. '30 ఏళ్ల కిందటే అప్పటి సీఎం చంద్రబాబు విద్యకు ప్రాధాన్యం కల్పిస్తూ.. గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్, వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చారు. గత వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైంది. 'నాడు-నేడు' పేరుతో కొన్నిచోట్ల పాఠశాలలు బాగుచేసినా.. విలీనం పేరిట వాటిని మూసేశారు. చిన్నారులకు విద్యను దూరం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 రద్దు చేసి.. మళ్లీ పాత విధానాన్ని కొనసాగిస్తూ ఉపాధ్యాయుల సహకారంతో పూర్వవైభవం తీసుకొస్తాం. జనవరి ఒకటి నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించనున్నాం. చాగంటి కోటేశ్వరరావు ద్వారా విద్యార్థులకు జ్ఞానవిద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అలాగే క్రీడల్లోనూ ప్రోత్సహిస్తోంది. పాఠశాల కమిటీలు బాధ్యత వహించి పాఠశాలల పురోభివృద్ధికి కృషి చేయాలి. స్థానిక కస్తూర్బా పాఠశాలకు మరో రెండు భవనాలు మంజూరు చేశాం. మరో డార్మెంటరీ భవనం మంజూరు చేయనున్నాం. ఇదేవిధంగా సంతబొమ్మాళి కేజీబీవీని తయారుచేస్తామ'ని తెలిపారు. ఇకపై శిలాఫలకాలపై నేతల ఫొటోలు ముద్రించరాదని, పేర్లు మాత్రమే ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, విజయలక్ష్మి, శైలజ, కల్లి నాగయ్యరెడ్డి, కర్రి అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, ఈఈ డీవీఎన్ మూర్తి, జేఈ రామనాథం, ఏఈవోలు గోవిందరావు, ఎల్‌వీ ప్రతాప్, ప్రిన్సిపాల్ కె.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేయాల్సిందే!

- సచివాలయ ఉద్యోగులకు అమలు
- రోజుకు రెండుసార్లు తప్పనిసరి
- సమయపాలన పాటించేందుకే..
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

● మెళియాపుట్టి మండలం వెంకటాపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని ప్రతిరోజూ పాతపట్నం నుంచి విధులకు వస్తుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు హాజరై, మళ్లీ 2 గంటల తరువాత వెళ్లిపోతుంటారు. ఆమె సమయపాలన పాటించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ, నెల వచ్చేసరికి ఆమె పూర్తిస్థాయి జీతం అందుకుంటుంది.



నందిగాం గ్రామ సచివాలయం

సంతబొమ్మాళి/మెళియాపుట్టి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఇక నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాల్సిందే. విధిగా సమయపాలన పాటించి, రోజుకు రెండుసార్లు ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేస్తేనే వారికి పూర్తిస్థాయి వేతనం అందనుంది. నిమిషం ఆలస్యమైనా హాజరు తీసుకోదు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాత పంచాయతీ కార్యదర్శులు, పాత వీర్వోలు, గ్రేడ్-1 ఏఎన్ఎంలకు మాత్రం బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇచ్చింది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో మొత్తం 930 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామ సచివాలయాలు 835, వార్డు సచివాలయాలు 95 ఉన్నాయి. వీటిల్లో 8,056 ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందిదే పెత్తనం. వారు ఎప్పుడు వచ్చినా, వెళ్లినా అడిగే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పటికీ కొంత మంది సచివాలయ ఉద్యోగులు డీడీవోలుగా ఉన్న కార్యదర్శుల మాట వినడం లేదని తెలుస్తుంది. అదేమని ప్రశ్నిస్తే క్షేత్రస్థాయిలో ఉన్నామంటూ సాకులు చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టి సొంత పనులు చేసుకుంటున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాల్సిందేనని జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డిజైన్..

గత వైసీపీ ప్రభుత్వంలో కూడా సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానం ఉండేది. మూడుసార్లు ఎప్పుడైనా హాజరు వేసుకునే వెసులుబాటు ఉండేది. పైగా వేసినా, వేయకపోయినా అధికారులు పట్టించుకునేవారు కాదు. దీంతో కొందరు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేవారు కాదు. మరి కొందరు విధులకు డుమ్మాకొట్టేవారు. దీన్ని గుర్తించిన కూటమి సర్కారు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేసింది. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డిజైన్ చేశారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా హాజరు తీసుకోదు. ఉదయం వేసి సాయంత్రం వేయకపోయినా క్యాజువల్ సెలవుగా గుర్తిస్తారు. రోజుకు కచ్చితంగా రెండు సార్లు బయోమెట్రిక్ హాజరు ఉంటేనే జీతం ఇచ్చే విధంగా ఖజానా శాఖకు అనుసంధానం చేశారు.

ఉత్తర్వులు వచ్చాయి..

సచివాలయ ఉద్యోగులు రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలి. దీన్ని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-పద్మజ, ఇన్‌చార్జి ఎంపీడీవో, సంతబొమ్మాళి

సమాచారం

అంబేడ్కర్ వర్సిటీకి రూ.20కోట్లు మంజూరు

ఎచ్చెర్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి కేంద్ర విద్యాశాఖ పీఎం ఉషా(ప్రధాన మంత్రి ఉచ్చతార్ శిక్షా అభియాన్) రూ.20 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 61 యూనివర్సిటీలకు నిధులు మంజూరుచేయగా, రెండో విడతగా 12 యూనివర్సిటీలకు నిధులు కేటాయించింది. ఇందులో అంబేడ్కర్ యూనివర్సిటీకి చోటు దక్కడంతో అభివృద్ధికి మార్గం సుగుమమైంది. పీఎం ఉషాకు అప్పటి వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు హయాంలో ప్రతిపాదనలు పంపారు. రానున్న ఐదేళ్లలో ఈ నిధులు విడతల వారీగా విడుదల చేస్తారు. కొత్తగా భవనాల నిర్మాణం, పాతవాటిని మెరుగుపర్చడం తదితర మౌలిక సదుపాయాలు కల్పనకు వీటిని వినియోగిస్తారు. అలాగే వివిధ కోర్సుల ల్యాబ్‌ల అభివృద్ధి, విద్యార్థుల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించేలా సర్టిఫికెట్ కోర్సుల శిక్షణ, వర్క్‌షాపు, సెమినార్‌ల నిర్వహణకు ఈ నిధులను వెచ్చిస్తారు. వెనుకబడిన వర్గాలు, గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో ఈ వర్సిటీకి రెండో విడతలో ప్రాధాన్యం దక్కింది.

రైతులకు మరో చాన్స్

● పంటల బీమాకు గడువు పెంపు

హిరమండలం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పంటల బీమా నమోదుకు ప్రభుత్వం గడువు పెంచింది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం కింద పరిహారం అందజేస్తున్నాయి. ఈ సారి రబీసీజన్‌లో శనగ, వరి, జొన్న, మినుము, మిరప, మొక్కజొన్న పంటలకు బీమా సదుపాయం కల్పించాయి. నిబంధనలు ప్రకారం వరి తప్ప ఇతర పంటలు వేసిన రైతులు ఈ నెల 15లోగా బీమా నమోదు చేసుకోవాలి. కానీ చాలామంది రైతులు నమోదు చేసుకోలేదు. రైతులు అందరికీ ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 31 వరకూ గడువు పెంచింది. ఖరీఫ్‌లో పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి.. రైతులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంది. రబీలో మాత్రం బీమా పథకంలో రైతు వాటా కింద నామమాత్రంగా ప్రీమియం చెల్లించాలి. వరి గ్రామం యూనిట్‌గా, వేరుశనగ జిల్లా యూనిట్‌గా, మిగిలిన పంటలు మండలం యూనిట్‌గా బీమా వర్తింపజేయనున్నారు. వరి పంటకు సంబంధించి ఎకరాకు రూ.630 ప్రీమియం సొమ్ము రైతులు చెల్లించాలి. పంటలు దెబ్బతింటే ఎకరాకు బీమా కంపెనీ రూ.4,200 చెల్లిస్తుంది. పంట సరాసరి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది. రైతులకు రుణాలిచ్చే బ్యాంకులు, సొసైటీలు ముందే బీమా సొమ్ము మినహాయించుకుని రుణం అందిస్తాయి. అందువల్ల రుణం పొందిన రైతులు బీమా చెల్లించాల్సిన పనిలేదు. మిగిలిన వారు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలి. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 640 మంది రైతులు పంటల బీమా నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 23,993 హెక్టార్లలో రబీ సాగు చేసినా.. కేవలం 315హెక్టార్లకు మాత్రమే ప్రీమియం చెల్లించారు. మిగిలిన రైతులు తక్షణమే బీమా చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని హిరమండలం వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు.



నీట మునిగిన వరి పంట

● ఎలా నమోదు చేసుకోవాలంటే..

రైతుసేవ, మీ సేవ కేంద్రాల్లో రైతులు బీమా నమోదు చేసుకోవాలి. ఈ-క్రాప్‌తోపాటు రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పొందుపరచాలి. సాగు ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఆన్‌లైన్ నిర్దేశిత రుసుం చెల్లిస్తే రశీదు బీమా పత్రం అందజేస్తారు. దానిని అధికారులకు అందజేయాలి. విపత్తుల సమయంలో 33 శాతం కన్నా ఎక్కువగా పంట నష్టపోతే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. పంట నష్టాన్ని అంచనా వేసి బీమా సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

జీడి పరిశ్రమలో అగ్నిప్రమాదం

● రూ.2కోట్ల వరకూ నష్టం వాటిల్లినట్టు అంచనా

హరిపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురంలోని వెంకటబాలాజీ జీడి పరిశ్రమలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అల్లుల్ల కాలనీ సమీపంలోని నల్ల జశ్వంత్‌కు చెందిన ఈ పరిశ్రమలో రాత్రి ఒంటిగంట సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో పక్క పరిశ్రమలో ఉన్న కార్మికులు, కాలనీ వాసులు అప్రమత్తమై పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన వారంతా అక్కడికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. పరిశ్రమలో జీడిపిక్కలు, రవాణాకు సిద్ధంగా ఉన్న జీడి పప్పు అగ్నికి ఆహుతైనట్టు తెలిపారు. సుమారు రూ.2కోట్ల వరకూ ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. సంఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



రంగనాథ స్వామికి కిరణ స్పర్శ

టెక్కలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి శ్యామసుందరస్వామి ఆలయంలో గోదాదేవి సహిత రంగ నాథస్వామి మూలవిరాట్ పాదాలను ఆదివారం సూర్యకిరణాలు తాకినట్లు అర్చకుడు పద్మనాభ పండా తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా ఈ దృశ్యం ఆవిష్కృతమైందన్నారు. స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

టీచర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్



- ఆరు కేసుల్లో నిందితుడు
- 8.25 తులాల బంగారం స్వాధీనం
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

8లో

దిక్సూచి DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్



- హైదరాబాద్ సర్కిల్: 342
- అమరావతి సర్కిల్: 50
- చివరి తేదీ: 2025 జనవరి 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు.
- పూర్తి వివరాల కోసం: sbi.co.in/web/careers/current-openings వెబ్‌సైట్ చూడవచ్చు.

భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.

హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయిన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్ణీత వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్

- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. వెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్ణీత సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్టులు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ఠ స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు

- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, ఫిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్

- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్

- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టీపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్, టాబులర్ డిఐ తదితర డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్

- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు

- **క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date: 31-12-2024 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.
Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.
Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.
Last Date to Apply: 15-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2025

అడ్మిషన్



దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ ప్రకటన వెలువడింది. 2025 మే 18న ఎంట్రెన్స్ నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 2న ప్రకటిస్తారు. 2025 ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీల్లో 17,695 బీటెక్, బీఎస్(బ్యాచిలర్ ఆఫ్ సైన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయడానికి అర్హులు. ఈ సంవత్సరం పరీక్షలను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

కలికిరి సైనిక్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు

జాబ్ కార్నర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం ఏడు ఉద్యోగాలు ఉన్నాయి. స్కూల్ మెడికల్ ఆఫీసర్-1, పీజీటీ(కంప్యూటర్/ మేథ్స్)-2, టీజీటీ(సోషల్ సైన్స్)-1, పీటీఐ కం మ్యాట్రన్-1, కౌన్సెలర్-1, హార్స్ రైడింగ్ ఇన్‌స్ట్రక్టర్-1 ఖాళీలు ఉన్నాయి. 2025 జనవరి 10వ తేదీలోపు దరఖాస్తు పోస్టులో పంపించాలి. పూర్తి వివరాల కోసం https://sskal.ac.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా



జగపతి బాబు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్' క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్' 'నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు

- అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి



సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.



బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.

బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.







వసూళ్లలో కీలక పాత్ర

బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.

భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

సభ్యత్వ నమోదులో అలసత్వం వద్దు

జి.సిగడాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో అలసత్వం వీడాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి లక్ష సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ లక్ష్యాన్ని చేరుకోనేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్తలు నాయిన సూర్యనారాయణ, నాయిన వెంకటరావు.. అలాగే అనారోగ్యంతో బాదపడుతున్న చెట్టుపోదిలాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు భూపతి శ్రీరామూర్తిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కుమరాపు రవికుమార్, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, టంకాల మౌళీశ్వరరావు, కుదిరెళ్ల బుజ్జి, కంచరాన సూరన్నాయుడు, సిరుగుడి గోవిందరావు, కూనుబిల్లి కూర్మారావు, మజ్జి కన్నంనాయుడు, జక్కంపూడి దాసు, కామోజులు సీతారాం, బెవర జగన్నాథరావు, తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల ప్రథమ స్థానంలో నిలవాలి

లావేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఎచ్చెర్ల నియోజకవర్గం లక్షకు పైబడి సభ్యత్వ నమోదు చేపట్టి ప్రథమ స్థానంలో నిలవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం స్థానిక కళ్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన టీడీపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ విచ్చేసి మాట్లాడారు. సభ్యత్వ నమోదు వేగవంతం కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అధికంగా సభ్యత్వాలు నమోదు చేయించిన వారికి తగిన ప్రాధాన్యమిస్తామన్నారు. సమావేశంలో ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపీపీ మీసాల వెంకటరమణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు పిన్నింటి మధుబాబు, ఆర్.ప్రకాశరావు, నాయకులు లంక నారాయణరావు, లంకలపల్లి శ్రీనివాసరావు, కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం మండల పరిధిలో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన వరి చేనును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు పంట నష్టం మరోవైపు క్రాప్ ఇన్సూరెన్స్ చేయకపోవటం వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా జమ చేయని ప్రభుత్వ తీరును ఆయన ఎండగట్టారు.

కనీస వేతనాలు చెల్లించండి

అరసవల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఇచ్చిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. పైగా నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకుంటే వారు బతుకుతారని ప్రశ్నించారు కార్మికులందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు టేకి హేమ, పి.నవీన, వి.డిల్లేశ్వరి, బి.స్వాతి, కనకమ్మ, తిరోమణి, భాను, రాణి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు

అరసవల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జామియా మసీదులో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహించిన శిబిరంలో సుమారు 80 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రక్తం కొరత అధికంగా ఉందని, యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహనరావు, మహిబుల్లా ఖాన్, అబ్దుల్ కలాం, సలీం, ముజీబ్, షానవాజ్, హాజీ ఆలీఖాన్, అమీరుల్లా బేగ్, హాజీ భయ్యా, అక్బర్‌బాషా, సుకుర్‌ఖాన్, సయ్యద్ షఫీ, అబ్దుల్, ముబారక్, బాహాదుర్ బాషా, ఖాదర్, జామియా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో సాగునీటికి కష్టం

ఆమదాలవలస, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్లక్ష్యంలో సాగునీటి కాలువలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందని నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల డిల్లీశ్వరరావు విమర్శించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నూటకరాజు ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా డిల్లీశ్వరరావు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ప్రాజెక్టు చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రూ.146 కోట్లు జైకా నిధులతో పూర్తిస్థాయి అభివృద్ధి చేయడానికి టీడీపీ హయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చర్యలు తీసుకున్నారన్నారు. ఆ తర్వాత ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఆ నిధుల దారి మళ్లింపుపై ఒత్తిడి తీసుకురావడంతో అప్పటి కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోర గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.మురళీధరరావు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తంగి గురయ్య, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



ఎచ్చెర్ల: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



శ్రీకాకుళం: టాలెంట్ టెస్టులో విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

అరసవల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణితంపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈమేరకు ఆదివారం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితంపై అధ్యాపకులు పూర్తిస్థాయిలో నైపుణ్యాలను సాధించి, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా మాథ్స్ ఫోరానికి ఒక గది కావాలని ఉపాధ్యయులు కోరడంతో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో గదిని కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. జిల్లాకు పోటీ పరీక్షల కోసం వచ్చే విద్యార్థులకు రూ.10 కోట్లతో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు. అందులో డిజిటల్ లైబ్రరీ, విద్యార్థులకు రూమ్‌లు, ఇతర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన 150 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల: ధర్మవరంలో గరుడ యూత్ ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వేద గణిత ప్రచారకుడు రామారావు గొంగాడ నిర్వహించిన సెమినార్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు రుప్ప లక్ష్మంనాయుడు, మలిపెద్ది జయరాం, రుప్ప రమేష్, మలిపెద్ది చంద్రశేఖర్, రామారావు, టేకి ఆచారి పాల్గొన్నారు.

కంచిలిలో..

కంచిలి: చోట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. హెచ్ఎం మద్దు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్ మ్యాజిక్ స్క్వేర్ కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. 16 మంది విద్యార్థులు ప్లకార్డులతో డ్యాన్స్ మ్యాజిక్ చేశారు. కార్యక్రమంలో లింగమూర్తి, సుదరరావు, కామరాజు పాల్గొన్నారు.

కవిటిలో..

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరామానుజన్ విగ్రహానికి పాఠశాల చైర్మన్ టి.మోహనరావు పూలమాల వేశారు. కార్యక్రమంలో బి.రమేష్, ఎ.మధు, బి.సురేష్, ఎ.రాజు, జి.రామారావు పాల్గొన్నారు.



కంచిలి: చోట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో..



కాశీబుగ్గ: జడ్పీ హైస్కూల్‌లో

తాతకు తగ్గ మనవడు దేవాన్ష్

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చదరంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన నారా లోకేశ్‌బాబు కుమారుడు దేవాన్ష్, తన తాత చంద్రబాబుకు తగ్గ మనవడని నిరూపించుకున్నాడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ కొనియాడారు. ఈమేరకు ఆదివారం వారు వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. చదరంగంలో చేస్తూ వేగంగా పావులు కదపడం, చెక్‌మేట్ సాల్వర్, 175 పజిల్స్ సాధించిన దేవాన్ అద్భుత ప్రతిభ కనబరిచాడని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

పారిశ్రామికంగా వృద్ధి చెందాలి



పెట్రోల్‌బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, డిసెంబరు 22 : యువత పారిశ్రామికంగా వృద్ధి సాధించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో ఏదేశంలోలేని యువశక్తి భారత్ సొంతమన్నారు. 20 ఏళ్ల తరువాత భారతదేశం ప్రపంచంలో మెదటిస్థానంలో ఉంటుందన్నారు. యువత ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతంగా ఆర్థికంగా, పారిశ్రామికంగా వృద్ధి చెంది పలువురికి ఉద్యోగ, ఉపాధావకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బాడాన గిరి, హారిక, కూన ప్రమీల, కూన సత్యనారాయణ, సీహెచ్ రామ్మోహన్, ఎం.రమేష్, బి.శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలకు స్కౌట్స్ దోహదం

గుజరాతీపేట, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.తిరుమల చైతన్య అన్నారు. జిల్లాలోని వివిధ స్కౌట్ మాస్టర్లు, గైడ్స్ కెప్టెన్లకు ఈ నెల 16 నుంచి వారం రోజులపాటు జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో భారత స్కౌట్స్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ గైడ్స్ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు సమాజసేవ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలను నేర్చుకుంటారన్నారు. ఈ శిక్షణలో 36 మంది స్కౌట్స్ మాస్టర్లు, 33 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. కార్య క్రమంలో భారత స్కౌట్స్ గైడ్స్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి వి.వాగ్దేవి, ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం

గుజరాతీపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ ఏపీహెచ్‌బీ కాలనీలో ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయుడు ముద్దాడ ఆదినారాయణను విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించారు. ఆయనకు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ప్రదానం చేసిన నేపథ్యంలో సత్కరించినట్లు సంఘ అధ్యక్షుడు బి.కైలాసరావు తెలిపారు.

నిరుపయోగంగా గోదాం



సరుబుజ్జిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నల వలస జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో నిర్మించిన పౌర సరఫరాల గోదాం వినియోగానికి దూరంగా ఉంది. టీడీపీ హయంలో పౌర సరఫరాల సరుకులు నిల్వ చేయడానికి సుమారు రూ.30 లక్షలు వెచ్చింది గోదాం నిర్మాణం చేపట్టారు. అయితే ఎనిమిదేళ్లుగా ఈ గోదాం వైపు కన్నెత్తి చూడటంలేదు.

గిట్టుబాటు ధర కల్పించండి



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బస్వా గురుమూర్తిరెడ్డి

ఎచ్చెర్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సరుగుడు, నీలగిరికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సరుగుడు, నీలగిరి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బస్వ గురుమూర్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు గాలి వెంకటరెడ్డిలు కోరారు. మండలం కేశవరావుపేట జంక్షన్‌కు సమీపంలో జిల్లాకు చెందిన సరుగుడు, నీలగిరి రైతులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో సరుగుడు, నీలగిరి తోటల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారంతా గిట్టుబాటు ధర సమకూరక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా నుంచి సరుగుడు, నీలగిరిని జేకే పేపర్‌మిల్లు(రాయఘడ), ఏపీ పేపర్ మిల్లు (రాజమండ్రి), ఐటీసీ పేపర్ మిల్లు (భద్రాచలం)కు ఎగుమవుతోందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 10 వరకు 18 అడుగులు ఉండే సరుగుడు కర్రల టన్ను రూ.9,200లకు కొనుగోలు చేసేవారన్నారు. ఇదే కొలతల కర్రలను ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదని, మిల్లర్ల చుట్టూ తిరిగితే ఐదారు వేలకు మించి కొనుగోలు చేయడంలేదన్నారు. ఒక్కసారిగా ధర తగ్గిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీలగిరి కర్రలు టన్ను రూ. 8 వేలు ఉండగా, దాన్ని రూ.500 తగ్గించారని, ఈ ధర మరింత తగ్గుతుందని మిల్లర్లు చెబుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సరుగుడు, నీలగిరికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సమావేశంలో బి.రాంబాబు, ఆరేళ్ల కృష్ణ, పైడిపెద్ది పూర్ణచంద్రరావు, అలుపన సింహాచలం, బగ్గ శ్రీను, ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ

రికార్డుల నిర్వహణపై ఎస్పీ అసంతృప్తి

ఆమదాలవలస, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు వివరాలు, చర్యలు, పెండింగ్ కేసుల వివరాలను సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు.

24 మద్యం సీసాలు స్వాధీనం



సోంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకపేట గ్రామానికి చెందిన కదంబాల పూర్ణచంద్ర ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు బారువ ఎస్ఐ ఎస్.హరిబాబు నాయుడు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎక్సైజ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేశామన్నారు.

ఆదిత్యుడి ఆదాయం రూ.2.93 లక్షలు

అరసవల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత సూర్యనారాయణస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి రూ. 2,93,149 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.62,500, విరాళాల ద్వారా రూ. 83,459, ప్రసాదాల ద్వారా రూ.1,47,910ల ఆదాయం సమకూరింది.

వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతున్న మండలంలోని బుడ్డెపుపేటకు చెందిన బుడ్డెపు మోహనరావుకు సోషల్ రెస్పాన్సిబులిటీ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థికసాయం చేశారు. మోహనరావు వైద్య ఖర్చులకు దాదాపు రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తేల్చారు. ఆ విషయాన్ని తెలుసుకున్న ఆర్గనైజేషన్ అధ్యకుడు ధనుష్ రంగా స్పందించారు. బాధితుడి కుమార్తె అరుణకు ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యకమంలో రాజు ఉన్నారు.

పంటను పరిశీలించిన నాయకులు

కంచిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల వల్ల నీట మునిగిన పంటను ఆదివారం టీడీపీ నాయకులు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామారావు, హరిబాబు, భాస్కర్, కిషోర్, శ్రీకాంత్, పూర్ణ, వంశీ తదతరులు పాల్గొన్నారు.

పంట నష్టం ప్రభుత్వం దృష్టికి..

ఇచ్ఛాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు అన్నారు. వర్షాలకు నేలకొరిగిన చేను, కళ్లాల్లో ధాన్యం నిల్వలను ఆదివారం ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేకళ్ల భాస్కర్, ప్రేమ్, హేమంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

లావేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంటకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ డిమాండ్ చేసారు. ఆదివారం మండలం పెదకొత్తకోటల్లో నీట మునిగిన పంటను పరిశీలించారు.

గోదాదేవికి పూజలు

జి.సిగడాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవురిటిలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

కళింగాంధ్ర సామాజిక ప్రయాణమే 'నక్షత్రబాట'



నవలను ఆవిష్కరిస్తున్న రచయిత్రి రమాసుందరి

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కళింగాంధ్ర సామాజిక విప్లవోద్యమాన్ని నక్షత్ర బాట నవలలో రచయిత అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించారని రచయిత్రి రమాసుందరి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించి నక్షత్రబాట నవల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్రీకాకుళం విప్లవోద్యమంలో గత నాలుగు దశాబ్దాల నుంచి ఇప్పటి వరకు పోరాటంలో ఎంతో మంది వీర నారీమణులు సాధించిన విజ యాలను గొప్పగా ప్రస్తావించారన్నారు. అయి తే శ్రీకాకుళం ఉద్యమంలో పంచాది నిర్మలను మాత్రం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంత వీరమణులను నక్షత్రబాటలో ప్రముఖంగా ప్రస్తావించారన్నారు. స్నేహ కళాసమితి అధ్యక్షుడు గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ నక్షత్ర బాటను సిక్కోలు యాసలో నవల రాయడం అభినందనీయమన్నారు. నవల రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లా డుతూ ఈ నవలలో విప్లవోద్యమాన్ని, విస్తృత కళింగాంధ్ర సామాజిక ప్రయాణాన్ని సాహిత్యీకరణ చేశానన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు చీకటి దివాకర్, తామాడ అరుణ, పైల అరుణ, గార రంగనాథం, పిల్లా తిరుపతిరావు, కుదుమ తిరుపతిరావు, సురంగి మోహనరావుతో పాటు సాహితీప్రియులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణరావు టెక్కలి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, లారీ డ్రైవర్ అబ్దుల్ భాషా రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


కూరుకుపోయిన బస్సు

టెక్కలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తెంబూరు రోడ్డులో ఆదివారం బలరాంపురం సమీపంలో పాతపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. టెక్కలి డిపోకి చెందిన బస్సు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కకు ఒరిగి కూరుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 12 మంది ప్రయాణికులున్నారు. అయితే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగలేదని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.

పోలీసులకు చిక్కిన దొంగలు?

శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ వ్యాపారి ఇంట్లో కత్తులతో చొరబడి దొంగ తనానికి యత్నించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముగ్గురు దొంగలను స్థానిక పోలీసులు 24 గంటల్లోనే పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని కాకివీధిలో నివసిస్తున్న కోరాడ గోవింద్ ఇంట్లో శనివారం రాత్రి 7.20 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు కత్తులతో చొరబడిన విషయం పాఠకులకు తెలిసిందే. దొంగతనానికి యత్నించిన వారిలో ఒకరిని శ్రీకాకుళం సీఐ కె.పైడపు నాయుడు ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు ఘటన జరిగిన కొద్దిసేపటికే పట్టుకున్నారు. సదరు వ్యక్తిని సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు విచారించగా మిగిలిన వారి వివరాలు తెలియడంతో వాటి ఆధారంగా గాలిం చగా మిగిలిన ఇద్దరు విశాఖపట్నంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులకు దొరికినట్లు భోగట్టా. వారిని శ్రీకాకుళం తీసుకువచ్చి విచారించగా ఒకరిది భద్రాచలం, మిగిలిన ఇద్దరు నాగరకర్నూల్, కొత్త గూడెంలకు చెందిన వారుగా గుర్తించారు. వీరిలో ఒకరిపై గతంలో మర్డర్ కేసు ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇదిలా ఉండగా దీనిపై సీఐ పైడపు నాయుడును వివరణ కోరగా సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

బడ్డ నాగరాజుకు శిరీష పరామర్శ


బడ్డ నాగరాజు కటుంబానికి పరామర్శిస్తున్న గౌతు శిరీష

కాశీబుగ్గ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నా రు. చినబడాంలోని ఆయన ఇంటికి వెళ్లి ఆయనపై వైసీపీ నేతల కుట్ర, సంఘ టనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాగరాజు, కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నేతలు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన


శిథిలావస్థకు చేరిన వంతెన

కొత్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రవాణా వాహనాలతో నిత్యం రాకపోకలు సాగించే బ్రిటిష్ కాలం నాటి కర్లెమ్మ వంతెన శిథిలావస్థకు చేరింది. దాదాపు 9 దశాబ్దాల చరిత్ర ఉన్న వంతెన మొక్కలు, పొదలతో బీటలు వారి ప్రమాదకరంగా తయారైంది ఒడిశా వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడం తో వంతెన సామర్థ్యానికి మించి వందల టన్నుల బరువు కలిగిన వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. పెద్ద మలుపు, రోడ్డు విస్తరణ జరగడం వల్ల రోడ్డు వెడల్పు ఎక్కువగా, వంతెన వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు ప్రమాదాలతో వంతెన రక్షణ గోడ సైతం కూలిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాతపట్నం ఇరిగేషన్ కార్యాలయం..


దారుణంగా ఉన్న ఇరిగేషన్ కార్యాలయం

పాతపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని ఇరిగేషన్ శాఖాకార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం చెదలుపట్టి కిటికీలకు తలుపులు ఊడిపోయాయి. ద్వారబందాలకు చెదలు పట్టి ఊడిపోయాయి. చినుకు పడితే పూర్తిగా కారిపోతుండడంతో రికార్డులను భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మితమైన ఈ భవనానికి నేటివరకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. శిథిలమైన భవనంలో విధులు నిర్వహిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా..


గొల్లూరు వంశధార కాలువపై కాలిబాట వంతెన

నందిగాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గొల్లూరు జాతీయ రహదారి నుంచి రాంపురం వెళ్లే రహదారిలో గొల్లూరు సమీప వంశధార కాలువపై ఏర్పాటు చేసిన కాలిబాట వంతెన ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ వంతెన రైలింగ్ వెల్డింగ్ వదిలేయడంతో సపోర్ట్ లేక వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లూరు, రాంపురం, సొంటినూరు, చిన్నారిగోకర్లపల్లి గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం తదితర ప్రాంతాలకు దగ్గర మార్గం అయినప్పటికీ ఈ కాలిబాట వంతెన రైలింగ్ పాడైనా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

వర్షం తెరిపిచ్చినా..

● ఇంకా ముంపులోనే పొలాలు ● పంటను రక్షించుకునే పనిలో రైతులు ● క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడచిన మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. శనివారం రాత్రి నుంచి తెరిపి ఇవ్వగా ఆదివారం రోజంతా ఎండకాయడంతో పంటలను రక్షించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే ఇంకా నీటిలోనే పంటలు ఉండడంతో మొలకలు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పొలం నుంచి నీటిని తొలగించడం, పంటను ఎండబెట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయాధి కారులు పలు గ్రామాల్లో పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


ఎల్ఎన్‌పేట: కోవిలాం ఎద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


హరిపురం: బెల్లుపటియా గ్రామంలో తడిచిన వరిపైరును పరిశీలిస్తున్న పలాస ఏడీఏ మధు


మెళియాపుట్టి: పెద్ద లక్ష్మీపురంలో ఇంకా నీటిలోనే వరి కుప్ప


పలాసరూరల్: కాశీబుగ్గ జగన్నాథసాగరం ఆయకట్టులో పంట దుస్థితిని చూపుతున్న ఓ రైతు


జలుమూరు: అబ్బాయిపేట పొలాల్లో నిలువ ఉన్న వర్షం నీరు

టీచర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

● ఆరు కేసుల్లో ఇతడే నిందితుడు
● 8.25 తులాల బంగారం స్వాధీనం
● ఎస్పీ మహేశ్వరరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం/కవిటి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు చైన్ స్నాచిం గ్ దొంగతనాల్లో నిందితుడైన వ్యక్తిని ఇచ్ఛాపురం, కవిటి పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. డిసెంబరు 16న కవిటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ టీచర్‌పై రాయితో దాడి చేసి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దొంగను పట్టుకో వడంలో భాగంగా 21న కొజ్జీరియా జంక్షన్ వద్ద ఇచ్ఛాపురం సోదాలు నిర్వహిస్తుం డగా అనుమానంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతడిని కాశీబుగ్గ డీఎస్పీ అప్పారావు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం పోలీసులు విచారించారు. కవిటి లో టీచర్‌పై దాడి చేయడంతో పాటు గడిచిన ఆరు నెలల్లో కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో కంచిలిలో రెండు, కవిటిలో రెండు, ఇచ్ఛాపురంలో రెండు.. మొత్తం ఆరు దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో నిందితుడు నర్తు రాజేష్ అంగీకరిం చాడని వివరించారు. ఈ ఆరు దొంగతనాల్లో రూ.7,76,959 విలువైన 8.25 తులాల బంగారం దొంగిలించినట్టు గుర్తించి ఆ బంగారాన్ని రికవరీ చేశామన్నారు. గతంలో ఖతార్‌లో లేబర్ వర్క్ చేసేందుకు వెళ్లిన రాజేష్ ఈ ఏడాది జూలై 20న తిరిగి వచ్చాడన్నారు. రాజేష్‌ది కవిటి మండలం బైరిపురం గ్రామమని ఎస్పీ తెలిపారు.

దొంగతనాల నివారణకు చర్యలు

జిల్లాలో గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చైన్ స్నాచింగ్ దొంగతనాలు తగ్గాయని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది నమోదైన కేసులను ఛేదించామన్నారు. జిల్లాలో దొంగతనాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కాశీబుగ్గ ఒడిశా ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయన్నా రు. వాటిని కూడా ఛేదించి నూరు శాతం దొంగతనానికి గురైన బంగారాన్ని రికవరీ చేసున్నామన్నారు. చోరీ కేసును ఛేదించిన ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నం నాయుడు ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ వర్మ, ఏఎస్ఐ గోపాలరావు, పీసీలు ప్రసాద్, శ్రీను, బషీర్, రోణకేశ్వర రావులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, కాశీబుగ్గ డీఎస్పీ ఎం.అప్పారావు, సీసీఎస్ ఎస్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి సుబ్బారావు పాణిగ్రాహి



పలాస రూరల్: బొడ్డపాడులో విప్లవ గీతాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

పలాసరూరల్/హరిపురం/నరసన్నపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విప్లవ పోరాటాలకు స్ఫూర్తి సుబ్బారావు పాణిగ్రాహి అని పలు సంఘాల నేతలు అన్నారు. విప్లవ కవి, శ్రీకాకుళోద్యమంలో కీలకపాత్ర పోషించిన సుబ్బారావు పాణిగ్రాహి 55వ వర్ధంతిని పలాస మండలం బొడ్డపాడు, మందస మండలం రట్టి, నరసన్నపేట మండలం కోమర్తి గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బొడ్డపాడులో అమరవీరుల బంధుమిత్రుల సంఘం ఉభయ రాష్ట్రాల అధ్యక్షు రాలు పద్మకుమారి, జాతీయ మూఢనమ్మకాల నిర్మూలనా సంఘం అధ్యక్షుడు బైరి నరేష్, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయకార్యదర్శి కొర్రాయి నీలకంఠం, రట్టి గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలం రాజు మాట్లాడుతూ విప్లవ పోరాటానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజల సమస్యలపై చేసిన పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి రాసిన పాటలు తూటాలుగా పేలాయని, ఇప్పటికీ మారుమోగుతూనే ఉన్నాయన్నారు. 1969 శ్రీకాకుళం సాయుధ పోరాటంలో గన్ను, పెన్ను రెండింటికి సమన్వాయం చేసి పోరా టాలను ముందుకు తీసుకెళ్లి ప్రజల కోసం అశువులు బాసిన వ్యక్తి సుబ్బారావు పాణి గ్రాహి అని వక్తలు కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల ప్రతినిధులు సొర్ర రామారావు, జుత్తు వీరాస్వామి, ఎం.వినోద్, సవర బంగ్లా కుమార్, పొదిలాపు దాలినాయుడు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బగ్గు భాస్కరరావు, మామిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నౌపడ సత్యనారాయణకు సేవా అవార్డు

ఢిల్లీ ఏపీ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణకు సేవా అవార్డును బహూకరిస్తున్న సమైక్య తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు.

-(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

ఇదీ పిచ్చి మొక్కల తొలగింపు!

● నిధులు వృథా.. ఎక్కడి మొక్కలు అక్కడే..

కోటబొమ్మాళి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురంతో పాటు పలు గ్రామాల ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఆనుకుని రూ.80 లక్షలతో చేపట్టిన పిచ్చిమొక్కల తొలగింపు ప్రక్రియ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎక్స్‌కవేటర్ సాయంతో పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించడం ద్వారా ప్రమాదాలు అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో పిచ్చిమొక్కలను నామ మాత్రంగా తొల గిస్తున్నారు. దీంతో కొద్దిపాటి మొక్కలు పక్కకు తప్పించి మిగిలినవి వదిలేస్తుండడంతో నిధులు వృథా అవుతున్నాయి తప్ప ప్రయోజనం కనిపించడం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. చేపట్టిన పనులను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. దీనికి హరిశ్చంద్రపురం హైవే నుంచి చేపట్టిన పనులే ఉదాహరణ. ఎక్స్‌వేటర్ సాయంతో ఒక్కరోజులోనే 5 కిలోమీటర్ల దాటి పిచ్చి మొక్కలు తొలగించడంతో ఏమేర చేపట్టారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం పిచ్చి మొక్కల తొలగింపు ప్రక్రియ రోడ్డు నుంచి మూడు అడుగుల ఎర్త్‌వర్క్ చేపట్టాలి. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ఏదో చేసేశాం అన్నట్లు కొద్దిపాటి మట్టి కనిపించేలా మొక్కల తొలగింపు చేపడుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పిచ్చి మొక్కల తొలగింపు హాస్యాస్పద మవు తోంది. ఇప్పటికైనా అధికా రులు స్పందించి పూర్తి స్థాయిలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు తరువాత కూడా ఇలా..

తరగతులు జరగడం లేదని ధర్నా


ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెళియాపుట్టి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దమడి బాలుర గురుకుల పాఠశాలలో తరగతులు జరగడం లేదని పేర్కొంటూ ఆదివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహిం చారు. గత నెల రోజుల నుంచి పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లు సమ్మెకి వెళ్లడంతో తరగతులు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 320 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతోతరగతులపై ప్రత్యేక శ్రద్ధ చూపలేకున్నారని వారన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా సిలబస్ పూర్తికాలేదని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణం సమస్యను పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శారదామాత 172వ జయంతి



కాశీబుగ్గ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ శారదాపీఠంలో ఆదివారం శారదామాత 172వ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ వివేకానంద రామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పారాయణం, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

న్యూస్ బాక్స్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


ఢిల్లేశ్వరరావుకు షీల్డ్ అందించి అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించారు. వచ్చిన ప్రతి సమస్య పరిష్కరిస్తానని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం జాతీయస్థాయి వాలీబాల్ పోటీలో రాణించిన చిన్న హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన విద్యార్థి మొజ్జాడ ఢిల్లేశ్వరరావును మంత్రి అభినందించారు.

మంత్రి అచ్చెన్నాయుడు పరామర్శ

పాతపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాసిగంగుపేట గ్రామంలో సమీప బంధువు, వరసకు చిన్నత్తగారైన బండి ఎరకమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అంతకుముందుకు స్థానికంగా మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

సముద్రంలో స్నానాలకు దిగొద్దు


స్నానాలకు దిగుతున్న పర్యాటకులను వారిస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా సము ద్రంలో అలలు ఎగిసి పడుతున్నందున పర్యాటకులు స్నానాలకు దిగి ప్రమాదాలకు గురికావద్దని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. ఆదివారం శివసాగర్, తోటూరు తీరాలను సందర్శించి పర్యాటకులను అప్రమత్తం చేశా రు. పలువురు స్నానాలకు దిగుతుండడంతో వారిని వారించారు. రాకాశి కెరటాల కారణంగా సముద్రంలో ఇసుక కోతకు గురవుతోందని ఈ సమయంలో ఈతరాని వారు దిగితే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాగా ఆదివారం కావడంతో పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి తీర ప్రాంతాలకు వచ్చి ఆహ్లాదంగా గడిపారు.

మగ్గం జర్దోసిలో ఉచిత శిక్షణ


కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు అందిస్తున్న సమితి ప్రతినిధులు

పాతపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరంలో మగ్గం జర్దోశి శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్ర రావు మాట్లాడుతూ.. కొత్తగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో భాగంగా ఈ శిక్షణ ఇస్తున్నామని, దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. అనంతరం ఇటీవల కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా పూర్వ పు అధ్యక్షుడు లింగరాజు, జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, బీవీ అప్పారావు, ఇన్‌స్ట్రక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎ. విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీ కళాశాల బాలికల వసతిగృహంలో వివిధ అంశాలపై అవ గాహన కలిగించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఈవ్‌టీజింగ్, సైబర్ మోసాలపై వివరించారు. హెచ్‌డబ్ల్యూవో డి.సునీత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రేపు బడ్జెట్ సమావేశం

నందిగాం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరుగు సమావేశనికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.